క థ

# శాంతి సుధ

- దీవి లక్ష్మీ రాజేశ్వరి


కాలింగ్ బెల్ మోగగానే తలుపు తీసింది సుధ. ఎదురుగా ఉన్న అపరిచిత యువతిని చూసి చకితురాలయింది. "లోపలికి రావచ్చాండీ!" నమ్రతగా అడిగింది ఆ యువతి. ఆమె వైపు ఓసారి నిశితంగా చూసి, "రండి!" అని దారి ఇచ్చింది సుధ.

"కూర్చోండి!" అని ఛైర్ చూపించి, తను మరొక కుర్చీలో కూర్చుంది సుధ.

ముగ్ధలా ముడుచుకుని కూర్చుంది ఆ యువతి.

ఇద్దరి మధ్య నిశ్శబ్దం చోటు చేసుకుంది.

"నేను మీ సహాయం కోసం వచ్చాను! నా పేరు అమల. మా ఇల్లు ఈ వీధి చివర ఉన్న బంగళా. మా అన్నయ్య అరుణ్ అపస్మారక స్థితిలో ఉన్నాడు. డాక్టర్లు శతవిధాల ప్రయత్నించారు. వారికి సాధ్యం కాలేదు. అన్నయ్య 'శాంతి... శాంతి' అని ఒకటే కలవరిస్తున్నాడు. ఆమె వస్తే తప్ప అన్నయ్య బ్రతకడు. మాకు ఒక్కగానొక్క అన్నయ్య. వాడు లేకపోతే మేము బ్రతకలేము. ఎలాగయినా వాడు బ్రతకాలి అందుకే మీ సహాయం అర్థించడానికి యాచకురాలిగా మీ ఇంటికి వచ్చాను!"



"మీరనేది నాకేమీ అర్థం కాలేదు! మీ అన్నయ్య బ్రతకటానికి నా సహాయమేమిటీ" ప్రశ్నించింది సుధ.

'ఓ సారీ! అసలు విషయం చెప్పలేదు కదూ! మా అన్నయ్య, శాంతి ఇద్దరు ప్రేమించుకున్నారు. కారణం ఏదయితేనేమి వారి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. పెళ్లికి ఒప్పుకోలేదు. వారు పెద్దలను ఎదిరించి తిరపతి కొండమీద పెళ్లి చేసుకుందామని వెళ్లారు. దారిలో యాక్సిడెంట్ అయింది. శాంతి అక్కడికక్కడే మరణించింది. అన్నయ్య పరిస్థితి ఇలా అయింది. శాంతి అచ్చు మీలానే ఉంటుంది. మా అన్నయ్య కోలుకునే వరకు మీరు శాంతి లాగా నటిస్తే మా అన్నయ్య మాకు దక్కుతాడు!"

"చూడండీ! నేను మీరు కోరినట్టు చెయ్యటానికి నాకేమీ అభ్యంతరం లేదు. చేస్తాను కూడా. ఆ తర్వాత నా జీవితం ఏమిటీ? నేను వంటరి ఆడదాన్ని. ముందు వెనక ఎవరూ లేనిదాన్ని. దానికి కూడా పరిష్కారం చెప్పండి!" అంది సుధ.

"నాకు తెలుసండి మీ సంగతి. మీ వారు ఫారెన్‌లో వున్నారు. మీరు ఇక్కడ ఒంటరిగా వుంటున్నారు. మీవారి ఫోన్ నంబర్ చెప్పండి! ఫోన్ చేసి అడుగుతాను! మీవారి అనుమతితోనే మాకు సహాయం చేద్దురుగానీ!" అంది అమల.

సుధ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది.

"ప్లీజ్ సుధగారు! మీరు చేసిన సహాయానికి ఆజన్మాంతం కృతజ్ఞులమై ఉంటాం. మా కుటుంబ సభ్యులందరం" అంది అమల.

"మావారితో నేనే మాట్లాడి చెపుతాను! అంతవరకు వెయిట్ చెయ్యండి!" అంది సుధ.

"థ్యాంక్ యూ సుధా! థ్యాంక్ వెరీమచ్. కొంచెం త్వరగా ఫోన్ చెయ్యండి. నేను మరలా రాత్రికి వస్తాను బై!" అని వచ్చేసింది అమల.

సుధ గాఢంగా నిట్టూర్పు విడిచింది.

తనకి పెళ్లయింది. భర్త అమెరికాలో వున్నాడు. హుఁ అది అందమైన అబద్ధం. అది ఒక అద్భుతమైన కల్పన. నిజజీవితంలో తనొక పెళ్లికాని యువతి. ఆ విషయం ఈ ఊరు వచ్చిన తర్వాత చెప్పలేదు. ఉద్యోగరీత్యా ఈ ఊరు వచ్చింది. అందమైన తనలాంటి అవివాహిత స్త్రీని వంటరిగా ఈలోకం బ్రతకనివ్వదు. అందుకని నల్లపూసలు మెడలో కట్టుకుని ఆఫీస్‌కి పోతుంది. రాగానే అవి తీస్తుంది. ఎవరికి అనుమానం రాకుండా కట్టుకథ చెప్పింది. అందరూ నమ్మారు.

ఇప్పుడు ఈ విపత్తు నుండి ఎలా బయట పడాలి. మనిషిని పోలిన మనుషులుంటారు. ఖర్మగాలి ఆ శాంతి నాలాగా ఉండాలా. అది నా దురదృష్టం కాకపోతే. భగవాన్ ఎలాగో అబద్ధాలు చెప్పి బ్రతుకు గడుపుతున్న నామీద ఎందు కయ్యా ఇంత కక్ష సాధిస్తున్నావు! పోనీ నావలన కూడా ఒక మనిషి బ్రతుకుతాడంటే, అంతకంటే, ఈ పాపిష్టి జన్మకు కావలసిందేముంది.

000

సుధ శాంతి లాగా ఆ బంగళాలోకి అడుగుపెట్టింది. అమల ఆమెను ఇంట్లో అందరికి పరిచయం చేసింది. డాక్టర్ సుధకు అన్ని వివరంగా చెప్పి అలా చెయ్యమన్నాడు.

"అలాగే" అంది సుధ.

అక్కడున్న రోజులు శెలవు పెట్టింది సుధ! అరుణ్‌ని కంటికి రెప్పలా చూసింది. అందరు ఊహించిన దానికంటే, ముందే అరుణ్‌కి తగ్గి పోయింది. అంతేకాదు మామూలు మనిషి అయ్యాడు.

సుధ అక్కడునుంచి రావటానికి చూస్తోంది.

అరుణ్ ఆమెను విడిచి ఉండటం లేదు.

"శాంతీ! శాంతీ!" అని ప్రతిదానికి పిలుస్తున్నాడు. సుధకి ఇబ్బందిగా ఉంది. అయిన తప్పని పరిస్థితి. ఇంట్లో అందరు సుధ పరిస్థితికి జాలిపడుతున్నారు! అసలు సంగతి చెబుతామంటే అరుణ్‌కి ఏమవుతుందోనని భయపడుతున్నారు. చెప్పకపోతే సుధ పరిస్థితిని చూడలేకపోతున్నారు!

ఆరోజు!

అరుణ్ అందరిని హాల్లో సమావేశపరిచాడు!

సుధ రాలేదు. తల్లి, నలుగురక్కచెల్లెళ్లు వచ్చారు! "శాంతి ఏది" అడిగాడు.

"....."

ఆమెను పిలుచుకుని వచ్చాడు. "మీ అందరికి శుభవార్త చెప్పబో తున్నాను! శాంతితో నా పెళ్లికి మీరు ఇప్పటికైనా అంగీకరిస్తారని ఆశిస్తున్నాను. నాకు చాలా సంతోషంగా ఉంది. జరిగినదంతా ఒక పీడకలగా మరిచిపోదాము. పురోహితుడిని పిలుచుకురమ్మని మన మానేజర్‌ని పంపాను" అన్నాడు.

అందరి గుండెల్లో బండరాయి పడ్డట్టు అయింది. ఎవరు పెదవులు విప్పలేదు. అందరివైపు చూచిన అరుణ్‌కి అప్పటివరకు ఉన్న సంతోషమంతా మంచులా కలిగిపోయింది.

"ఏమిటీ! అలా వున్నారు అందరు. అయితే మీరు మారలేదన్నమాట. మారినట్టు నటించారు. నన్ను నమ్మించారు. నా వెర్రికాని మీరు ఇంత త్వరలో మారతారా. అయితే నా నిర్ణయం వినండి. నానగంతి మీరు పట్టించుకోనప్పుడు మీ సంగతి నాకు అనవసరం. మీదారి మీది. నా దారి నాది. ఇక ఈక్షణం నుంచి మీకు నాకు ఏం సంబంధం లేదు" అని అక్కడనుంచి గబగబా వెళ్లబోయాడతను.

"ఆగు బాబూ! అరుణ్ నువ్వు వెళ్లే ముందు నా మాటలు కూడా విని ఆ తర్వాత వెళ్లు"

000

"అదీ బాబూ జరిగిన సంగతి. ఇప్పుడు చెప్పు బాబూ!" అంది తల్లి.

"అమ్మా!" అని సుధ వైపు చూస్తే, ఆమె సీటు ఖాళీగా వుంది.

సూట్‌కేస్‌తో ప్రత్యక్షమయింది సుధ.

"అక్కడ నువ్వు వంటరిగా ఉండవద్దు సుధా! ఇక్కడే మాతోనే కలిసి మా ఇంట్లోనే ఉండు! మీవారి దగ్గర నిన్ను మా అరుణ్ అప్పగించి వస్తాడు!" అంది పార్వతమ్మ. ఆ మంచి మనసుల దగ్గర అబద్ధం చెప్పినందుకు దుఃఖం ఆపుకోలేకపోయింది.

సూట్‌కేస్ క్రింద పెట్టి రెండు చేతులతో ముఖం దాచుకుని ఏడ్చేసింది!

అందరు తెల్లబోయి చూస్తున్నారు!

"అమ్మా! చాలా పొరపాటు చేశారు. నా ప్రాణంకోసం ఆమె జీవితాన్ని బలి తీసు కున్నారు. ఆమె భర్త ఏమంటాడో అని ఆమె భయపడుతోంది!"

"అతని అనుమతితోనే అన్నయ్యా ఆమె చేసింది!" చెప్పింది అమల.

"కావచ్చు! కానీ మాటలు వేరు పనులు వేరు!" అన్నాడు అరుణ్.

"మీరందరు నన్ను క్షమించండి! నేను చెప్పినదంతా అబద్ధం. నాకు పెళ్లి కాలేదు. నాకు తల్లిదండ్రులెవరో తెలియదు. మేనమామ దగ్గర పెరిగాను. మా మామయ్య అత్తయ్య చాలా మంచివాళ్లు. నాకు చదువు చెప్పించి ఉద్యోగం ఇప్పించారు. కానీ దురదృష్టం నాకు పెళ్లి కాకుండానే వారు కాలం చేశారు. ఆ ఊరు నుంచి ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయింది.

నేను వంటరిదాన్ని. నాకు పెళ్లి అవుతుందని ఆశలేదు. చేసుకోవాలనే కోరిక లేదు! అందుకే అలా అబద్ధం చెప్పాను! నన్ను మీరు ఎలా అర్థం చేసుకున్నా ఫరవాలేదు. కానీ నాకు పెళ్లి కాలేదు అన్న నిజాన్ని మాత్రం ఎవ్వరికి చెప్పకండి. అది చాలు. ఇంక నాకు ఏమి అవసరంలేదు!" అంది సుధ.

ఆశ్చర్యచకితులయ్యారందరు.

సూట్‌కేస్ పట్టుకుని అడుగుముందుకు వేసింది సుధ.

"ఆగు సుధా! ఆగమ్మా! మంచికైనా చెడుకైనా ఆ భగవంతుడు నిన్ను మా దగ్గరకి చేర్చాడు. నువ్వు ఇక్కడే ఉండిపో!" అంది అరుణ్ తల్లి.

"వద్దండీ! దేనికైనా ఒక హద్దు ఉంటుంది! ఆ హద్దు దాటితే ఎవరికి అంత మంచిది కాదు. నన్ను వెళ్లనివ్వండి!"

"నేను అన్నమాట నీకు అర్థం కాలేదు! నిన్ను మా ఇంటికోడలుగా అంగీకరిస్తున్నాను!"

"పార్వతమ్మగారూ!"

"నిజం సుధా! నువ్వు అంగీకరిస్తే, నిన్ను వివాహం చేసుకుంటాను!" అన్నాడు అరుణ్.

అతనివైపు ఒకసారి చూచి, "నేను సుధను. శాంతిని కాదు!" అందామె.

"తెలుసు. నువ్వెవరో తెలుసుకోలేనంత అపస్మారక స్థితిలో లేను. నేను అమెరికాలో లేను. అక్కడ చదువుకోవటం లేదు. అందు కని తమరికి ఇష్టం లేదు కాబోలు. నేను ఇండియావాడి నని చులకన కాబోలు. పెళ్లి అయింతర్వాత హానిమూన్ ఫారెన్ తీసుకువెళతాలే" అన్నాడు అరుణ్ హాస్యధోరణిలో.

హాలంతా ఒక్కసారి నవ్వులతో మారుమ్రోగింది.

సుధ మొహం సిగ్గుతో రాగరంజితమయింది. అక్కడ వుండలేక లోపలికి పారి పోయింది. మరొక్కసారి అందరు హాయిగా నవ్వేశారు. ■

